క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో కొలువైన ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సీతారామస్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం జరిపించిన తర్వాత.. ఆంజనేయస్వామికి తమలపాకులు, సింధూరంతో విశేష అర్చనలు జరిపించారు. అనంతరం హనుమాన్ చాలీసాను పఠించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



కొండలరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడిన వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కొండలరావును విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. నగరంలోని కొండలరావు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట రాజాం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, నెక్కల నాయుడుబాబు, ఇప్పిలి అనంత, వలిరెడ్డి శ్రీనివాసరావు, మీసాల వరహాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ తప్పనిసరి

- ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి అధికారులను ఆదేశించారు. సీడీపీఓలతో మంగళవారం ఆమె జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బలహీనంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గాడిలో పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

పూర్తయిన పైప్‌లైన్ మరమ్మతులు



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

విజయనగరం: నెల్లిమర్ల రక్షిత మంచినీటి పథకాల నుంచి విజయనగరం నగరానికి నీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్‌కు సంబంధించిన మరమ్మతులు పూర్తయ్యాయి. మూడు రోజులుగా మరమ్మతులు చేపడుతుండడంతో నీటి సరఫరాలో అంతరాయం నెలకొంది. పనులు పూర్తి కావడంతో నగరంలోని కాటవీధి, ఇప్పిలి వీధి, పూల్‌బాగ్, వన్‌ప్లస్ వన్ కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాలలో మంగళవారం తాగునీరు సరఫరా చేశామని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు. బుధవారం నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

బహిరంగ మలవిసర్జన చేస్తే జైలు శిక్ష

నెల్లిమర్ల: నగర పంచాయతీలో బహిరంగ మలవిసర్జన చేస్తే రూ.500 జరిమానాతో పాటు పది రోజులు జైలుశిక్ష తప్పదని మున్సిపల్ కమిషనర్ కె. అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల నగర పంచాయతీని బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా కౌన్సిల్ తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

దివ్యాంగుల జీవితాల్లో భవిత వెలుగులు

- శారీరక, మానసిక లోపాలున్న పిల్లలకు విద్యాబుద్ధులు
- 540 మంది చిన్నారులకు పరికరాలతో శిక్షణ
- మనోధైర్యం అందిస్తున్న భవిత కేంద్రాలు



పూసపాటిరేగ భవిత కేంద్రంలో చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: శారీరక, మానసిక లోపాలతో బాధపడుతున్న పిల్లల జీవితాలలో భవిత కేంద్రాలు వెలుగులు నింపుతున్నాయి. ఫిజియోథెరపీ, వ్యాయామం, ప్రత్యేక పరికరాలతో వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాయి. విజయనగరం జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాలలో సుమారు 540 మంది వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలున్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారిలో మార్పు తీసుకువస్తున్నారు. ప్రభుత్వం చిన్నారులకు కావాల్సిన పరికరాలను అందిస్తోంది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల మండలంలో 20 మంది, డెంకాడలో 20, పూసపాటిరేగలో 20, భోగాపురం మండలంలో 19 మంది దివ్యాంగులున్నారు. మానసిక వైకల్యం, వినికిడి లోపం, సెరిబ్రల్ పాల్సి, బహుళ వైకల్యం వంటి 21 అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఫిజియోథెరపీ వైద్యుడి ద్వారా చికిత్స అందిస్తారు. ప్రతి నెలా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి చిన్నారులతో ప్రవర్తించాల్సిన తీరుపై వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అంగవైకల్యం కలిగిన పిల్లలచే ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తుంటారు. బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు వారి అవసరాలను ఎలా గుర్తించాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తారు. భవిత కేంద్రాలకు చిన్నారులకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం వివిధ రకాల ప్రోత్సాహకాలు అందిస్తోంది.

ట్రాన్స్‌పోర్టు అలవెన్స్: ప్రత్యేక శిక్షణ కోసం భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు నెలకు రూ. 300 చొప్పున ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ ఇస్తారు.

ఎస్కార్ట్ అలవెన్స్: 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠశాల లేదా కళాశాలకు నడిచి రాలేని పిల్లలకు సహాయంగావచ్చే వారికి నెలకు రూ. 300 చొప్పున అందిస్తారు.

స్టైఫండ్: ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విభిన్న ప్రతిభావంతుల బాలికలకు నెలకు రూ. 200 చొప్పున అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల సమస్యలతో వస్తున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. ఫిజియోథెరపీ, మసాజ్ వంటివి చేయించి పిల్లలను సాధారణ స్థితికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నాం – హిమబిందు, ఫిజియోథెరపీ వైద్యురాలు, పూసపాటిరేగ

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాసుని కల్యాణంలో పాల్గొన్న దంపతులు

విజయనగరం: వాసవీ క్లబ్ రజతోత్సవం సందర్భంగా శ్రీనివాస కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ... మొట్టమొదటిసారిగా గానంతో కల్యాణం చేయడం గొప్ప విషయమన్నారు. క్లబ్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన తరుణంలో లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కల్యాణం ప్రోగ్రాం చైర్మన్ బొడ్డు పండు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనారావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయకుమార్, రమేష్‌కుమార్, గుంపిన నారాయణరావు, పెదబాబు, డిమ్స్ రాజు, సముద్రాల నాగరాజు, ఏవీ కృష్ణారావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ



ట్రై సైకిల్ అందుకున్న దివ్యాంగుడితో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ ఆవరణలో రాయేతు తోటయ్య అనే దివ్యాంగుడికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ట్రైసైకిల్ అందజేశారు. కార్యక్రమంలోఆయనతో పాటు రాజాం మాజీ శాసనసభ్యుడు కంభాల జోగులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, సీనియర్ నాయకుడు నెక్కల నాయుడుబాబు, ఇప్పిలి అనంత, వలిరెడ్డి శ్రీను, మీసాల వరహాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి..

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, తదితరులు

డెంకాడ: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిపోయిన వరి పనలపై 25 కిలోల కల్లు ఉప్పును తగినంత నీటిలో కలిపి పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పినతాడివాడ పరిధిలో ఉన్న పొలల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పొలాల్లో వరి కుప్పలు, కళ్లాల్లోని ధాన్యం బస్తాలను పరిశీలించారు. కోత కోసి పొలాల్లో ఉన్న పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం వల్ల గింజలు మొలకెత్తవన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఏడీఏ ఎ.నాగభూషణం, ఏఓ పూడి నిర్మల, వ్యవసాయ సహాయకురాలు కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

మనోధైర్యం కల్పించాలి

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి



కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ రోగులకు మనోధైర్యం కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి రైతుబజార్ మీదుగా ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ బారిన పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. అవగాహనతోనే హెచ్ఐవి నిర్మూలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. కణపాకలోని మున్నా చర్చి ఆవరణలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ఎం.పాల్సన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలన్నారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డాక్టర్ వి.విజయకుమార్ శర్మ మాట్లాడుతూ... ఏసు రక్తం మనుషుల మనస్సాక్షిని శుద్ధి చేస్తుందన్నారు. శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. పేద పిల్లలకు సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ఈశ్వర్ కౌశిక్ క్యాండిల్ వెలిగించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వి.సుకుమార్, డాక్టర్ ఎం.ఐజాక్, రెవరెండ్ డి.ఎలీషా, 47వ కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, యూపీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీధర్, కార్యదర్శి ఎం.సైమన్, కోశాధికారి ఎస్.నికోడెమస్, ఎల్.మధుసూదనరావు, బి.ఆనంద్, థామస్ పాల్, జయప్రకాష్, పాల్, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

తరుణి ఫెస్ట్ - 2024



ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం కావాలని విజయనగరం క్లబ్ అధ్యక్షురాలు జి.శిరీషా అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఎన్ హోటల్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ విజయనగరం శాఖ ఆధ్వర్యంలో 'తరుణీ ఫెస్ట్ – 2024' ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనను అధ్యక్షురాలు శిరీషా, పూర్వపు అధ్యక్షురాలు ఉమాబాలాజీ, క్లబ్ చైర్మన్ అనిత భోత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు శిరీషా మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో మహిళలు రూపొందించిన చేతివృత్తులకు సంబంధించిన కళాకృతులను, మహిళలు ధరించే ఫ్యాన్సీ వస్తువులు, చీరలు, తదితర ఉత్పత్తులను ఉంచినట్లు తెలిపారు. విక్రయించిన ఉత్పత్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సేవా కార్యక్రమాలు వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కల్పనా కుక్రేజా, ఎ.లక్ష్మి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – విజయనగరం

పైడితల్లి చండీయాగం..



రైల్వేస్టేషన్ వద్ద నున్న పైడితల్లి ఆలయ ఆవరణలో మంగళవారం భక్తిశ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, తాతా రాజేష్‌లు శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను పూర్తి చేశారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్..



గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు టి.స్రవంతి తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న రచ్చబండ వద్ద మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌వీ మహాలక్ష్మి, ఏఎన్‌ఎం అరుణ, హెల్త్ అసిస్టెంట్ రమణ, డీఈఓ హేమంత్, ఆశ వర్కర్ రాధా, పైలట్ మహేంద్ర పాల్గొన్నారు. – భోగాపురం

నేడు ఎస్ఆర్ షాపింగ్ మాల్ వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న షాపింగ్‌మాల్ సిబ్బంది

విజయనగరం: వస్త్ర వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరసమైన ధరలకు వస్త్రాలను విక్రయిస్తూ అందరి మన్ననలు పొందుతున్న నగరంలోని ఎస్ఆర్ షాపింగ్‌మాల్ మొదటి వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు మాల్ డైరెక్టర్ కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రంలో మాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ.. మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా సినీ హీరో కిరణ్ అబ్బవరం హాజరుకానున్నట్లు తెలిపారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాల్లో అన్ లిమిటెడ్ ఆఫర్లతో వస్త్రాభిమానులను ఆకట్టుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాల్ ఏరియా మేనేజర్ ఫిరోజ్‌ఖాన్, బ్రాంచ్ మేనేజర్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

నెల్లిమర్ల: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వామపక్ష నాయకులు మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈఓ పిచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు మొయిద పాపారావు, సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు కొళ్ల అప్పలసూరి మాట్లాడుతూ.. సర్దుబాటు చార్జీల విధానమే రద్దు కావాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని కోరారు. వినియోగదారులపై విద్యుత్ భారం తగదన్నారు. కార్యక్రమంలో కంది వలస సూరప్పుడు, బొత్స నారాయణ, మొయిద ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



నగరంలో సర్వే చేపడుతున్న కార్పొరేషన్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు – ఔత్సాహిక వ్యాపారవేత్తల సర్వే మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు టీపీఆర్‌ఓ సింహాచలం, మెప్మా సిబ్బంది, ఎమినిస్స్, వెల్ఫేర్, శానిటేషన్ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఇంటిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంతమంది ఉన్నారు.. పరిశ్రమలు ఎలా నడుపుతున్నారు.. ఎటువంటి వ్యాపారాలు నడుపుతున్నారు.. తదితర వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వే డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి..

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆదరించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రాల్లోని చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగ చిన్నారులతో ఎలా మెలగాలో వైద్యులు, వక్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించి దివ్యాంగులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలంటూ నినాదాలు చేశారు. – నెల్లిమర్ల నెట్‌వర్క్



భోగాపురం: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రమణమూర్తి, తదితరులు



పూసపాటిరేగ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు



డెంకాడ: విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ శ్రీరామ్



నెల్లిమర్ల: : చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు